క్లుప్తంగా

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా 'బలరాం'



సీతానగరం: జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడిగా బూర్జ గ్రామానికి చెందిన కల్యాణ బలరాంను నియమిస్తూ మంగళవారం కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కలెక్టర్ చైర్మగా ఉన్న జిల్లా ఎస్సీ ఎస్టీ సంక్షేమాభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో జిల్లా బీసీ కార్పొరేషన్ మాజీ ఈడీ కల్యాణ బలరాంను నియమించడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు బలరాం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా నియమించడంతో తనపై ఉంచిన గురుతరమైన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు.

జిల్లా కమిటీ సభ్యుడిగా సామల సింహాచలం



పార్వతీపురం టౌన్: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బలిజిపేట ఎంఈఓ సామల సింహాచలం నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ అధికారుల తరపున తనను జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు కలెక్టర్‌కు సామల సింహాచలం కతజ్ఞతలు తెలిపారు.

మరిపల్లిలో పారిశుధ్య లోపం

● ఇబ్బందులు పడుతున్న జనం



మరిపల్లి గ్రామంలో చెత్తలతో నిండిన ప్రధాన రహదారి

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. గ్రామ ప్రధాన రహదారి చెత్తలతో నిండి ఉండడంతో నిత్యం గ్రామప్రజలు ఆ చెత్తలను దాటుకుంటూ ముక్కుమూసుకుని వెళ్తున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు ఇలాగే ఉంటే ప్రజలు రోగాల బారిన పడాల్సిందేనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

బంగారం పుస్తెలతాడు చోరీ

సీతానగరం: మండలంలోని రామవరం పంచాయతీ రెడ్డివానివలసలో సోమవారం రాత్రి గాఢమైన నిద్రలో ఉన్న మహిళ మంచం దిండు కింద భద్రపరిచిన బంగారం పుస్తెలతాడు చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులు మంగళవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రెడ్డి ప్రియాంక కన్నవారింట్లో (రెడ్డివానివలసలో) తండ్రితో పాటు పిల్లలతో సోమవారం రాత్రి పడుకుంది. వారంతా గాఢమైన నిద్రలో ఉండగా గుర్తు తెలియవ్యక్తి ఇంట్లోకి చొ రబడి వరండాలో పట్టిమంచంపై పడుకున్న ఆమె తలకింద భద్రపరుచుకున్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెల తాడు పట్టుకు ని వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబసభ్యులు ఇ చ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, సీసీఎస్ పోలీసులు పరిశీలించారని చెప్పారు.

ఈకేవైసీ నమోదు పూర్తి చేయండి

వీరఘట్టం: రైస్‌కార్డుదారుల ఈకేవైసీ నమోదు త్వరగా పూర్తి చేయాలని, ఆ దిశగా వీఆర్వోలు చొరవ తీసుకోవాలని తహసీల్దారు చందక సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో మంగళవారం సమావేశమైన ఆయన.. అన్నదాత సుఖీభవ పథకం కోసం ప్రతి రైతు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయాలని, అలాగే నీటితీరువా వసూళ్లపై దృష్టిసారించాలని తెలిపారు. కౌలురైతుల గుర్తింపుకార్డుల కోసం భూ యజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకురావాలని కౌలురైతులకు చెప్పారు. సమావేశంలో వీఆర్వోలు వంజరాపు రమేష్‌నాయుడు, గుంట్రెడ్డి రాజేంద్రప్రసాద్, భీమన్నదొర తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పప్పన్నం కరువు..!



కందిపప్పు

● బియ్యం, పంచదారలకే రేషన్ పరిమితం

పార్వతీపురం: పేదలకు కందిపప్పు కరువవుతోంది. చౌకధరల దుకాణాల్లో రాయితీద్వారా అందించే పప్పు సరఫరాకు ప్రభుత్వం మంగళం పాడింది. పేద, మధ్య తరగతివారికి గడిచిన ఐదు నెలల నుంచి రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా నిలిపివేసింది. తద్వారా పేదలకు పప్పన్నం కరువైంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర దాదాపు రూ.200కు చేరుకుంది. ఈ కారణంగా బహిరంగ మార్కెట్‌లో పేదలు అధిక ధర చెల్లించి పప్పును కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. జనవరి నుంచి ఇంతవరకు చౌకధరల దుకాణాల్లో కందిపప్పు సరఫరా ఊసే లేదు. ఎండీయూ వాహనాలను రద్దు చేసినంత వేగంగా కందిపప్పు సరఫరాను ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రభుత్వాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఇప్పుడు సరఫరా అవుతున్న సరుకులతోపాటు చిరుధాన్యాలు కూడా రేషన్ దుకాణాల్లో అందిస్తామని ఆశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కానీ అమలుకు ఎక్కడా నోచుకోలేదు. దీంతో రేషన్‌షాపులు కేవలం బియ్యం, పంచదార సరఫరాకే పరిమితం చేశారు.

ఇతర నిత్యావసరాలను సరఫరాచేయాలి



బియ్యం, పంచదార తోపాటు కందిపప్పు, రాగులు, గోధుమపిండి, వంటనూనె, చింత పండు, ఉల్లిపాయలు, చిరుధాన్యాలు, ఉప్పు, కారం తదితర నిత్యావసర సరుకులను సరఫరాచేయాలి. పప్పుదినుసుల ధరలు రోజురోజుకు పెరిగిపోతుండడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంటనూనె కిలో రూ.150కు చేరుకుంది. చౌకధరల దుకాణాల్లో సరఫరా నిలిపివేసిన సరుకులను పునరుద్ధరించాలి.

–పాలక రంజిత్‌కుమార్,
గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

జిల్లేడు వలస రోడ్డు గోతులమయం



రాళ్లు తేలి పూర్తిగా గోతులతో ఉన్న జిల్లేడు వలస రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని జిల్లేడువలస రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. ఈ రహదారి మామిడిపల్లి రోడ్డు నుంచి జిల్లేడువలస గ్రామానికి 5 కిలోమీటర్ల పొడవునా ఉంది. 5 పంచాయతీలకు సంబంధించిన 6 గిరిజన గ్రామాలు ప్రజలు ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కరాసవలస పంచాయతీ మర్లవలస, పిట్టడవలస మామిడిపల్లి పంచాయతీ, కాగుడుడివలస మరిపల్లి పంచాయతీ, పడాలవలస చిమిడివలస తోణాం పంచాయతీ, మునక్కాయవలస సారిక పంచాయతీకి సంబంధించిన గ్రామాల ప్రజలు ఈ రహదారిపై ప్రయాణం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు కొన్ని మలుపుల వద్ద పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. గిరిజన గ్రామాలకు రోడ్ల పండగ వచ్చిందని ప్రచారం చేసుకుంటున్న గిరిజన శాఖ మంత్రి ఈ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలు



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

సాలూరు: మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రజారోగ్యసిబ్బంది చేపలు, కోడిమాంసాల విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ తనిఖీల్లో 10 కేజీల పాడైన మాంసాన్ని గుర్తించారు. 4 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు.సదరు విక్రయదారులకు సుమారు రూ.6 వేల అపరాధరుసుము విధించారు. తూనికలలో తేడాలను గుర్తించిన నేపథ్యంలో సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా తెలియచేస్తామని తెలిపారు. అనంతరం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. వ్యాపారస్థలాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదు. కొలతల్లో తేడాలతో ప్రజలను మోసం చేయరాదని, కుళ్లిన, పాడైన మాంసాన్ని వాడరాదని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుంటే శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

నేడు ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండగగా పరిగణించిందన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలకరణ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, డీపీఓ కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా.టి.కనకదుర్గ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్ కృష్ణవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఇ.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడి మృతిపై కేసు నమోదు

సీతంపేట:

నిమ్మక హరీష్(23) మృతి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 22న తీవ్రమైన కడుపునొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలతో బాధపడుతున్న హరీష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడే అతడు చికిత్స పొందుతూ మరణించగా, పాయిజన్ కేసుగా వైద్యులు ధ్రువీకరించారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందాలి

పాలకొండ: అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందేలా చూడాలని సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దారు, వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల వివరాల నమోదు ఏ విధంగా జరుగుతుందన్న విషయంపై ఆరాతీశారు. ఈ నెల 30వ తేదీ లోగా రైతులందరి వివరాలు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ అయి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పథకం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం



తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న గ్రామ పెద్ద మోహనరావు

సీతంపేట: మండలంలోని పాలమానుగూడలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును గ్రామ పెద్ద సవర మోహనరావు మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తుల తాగునీటి అవస్థలు చూసి మరెన్నడూ వారికి తాగునీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారంగా ఈ మినీ రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేసినట్లు కార్యదర్శి పాపారావు తెలిపారు.

మహిళా ఉపాధ్యాయులనే నియమించాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని అన్ని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. గతంలో బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులు ఉండడం వల్ల బాలికలు వేధింపులకు గురైన సంఘటనలు వెలుగు చూశాయని గుర్తు చేశారు.
ప్రస్తుతం బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులే ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో రోజువారీ, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తే దీర్ఘకాల ఉద్యోగులకు కూడా స్థాన చలనం చేయాలని కోరారు.

ఘనంగా యోగా దినోత్సవం



సీతానగరం: యోగా ర్యాలీ నిర్వహిస్తున్న, ఎంపీడీఓ ప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం:

జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మండల స్థాయి అధిరులతో యోగా అవగాహనా ర్యాలీ జరిగింది. ముందుగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావుల పర్యవేక్షణలో యోగా గురువు, ఆయుష్ డాక్టర్ టి.హేమాక్షి, ఈదుబిల్లి శ్రీనివాసరావు యోగా విద్యను బోధించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందుతున్న వైద్యులు అధికార సిబ్బంది అంతా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే గుర్తించిన యువతీ యువకులకు యోగా శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం ఉన్నత పాఠశాల నుంచి సీతానగరం మార్కెట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న చెల్లంనాయుడువలసలో గ్రామ పెద్దలు యోగా అభ్యాసం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.ఉషారాణి, పి.పావని, సీహెచ్ఓ ఎస్వీ రమణ, ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ,డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు డీఆర్పీ ఈదుబిల్లి శ్రీనివాసరావు యోగాశిక్షణ తరగతులను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యువతీ యువకులు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యోగాంధ్రా కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో నిర్వహించాలని మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. అందుకనుగుణంగా డీఆర్పీలు శిక్షణ ఇచ్చారని, ఇక్కడి శిక్షణ పొందిన వారంతా గ్రామాల్లో యోగాసనాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో సంపద సృష్టి కేంద్రాలు



ఖాళీగా ఉన్న పిట్స్



కరాసవలసలో సున్నం వేసి వదిలేసిన సంపద సృష్టి కేంద్రం

● కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

సాలూరు రూరల్: మండలంలో ఏర్పాటు చేసిన చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నామయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేసి అప్పట్లో ఆ ప్రభుత్వం షెడ్లు, పిట్‌ల నిర్మాణం చేపట్టి గాలికి వదిలేసింది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఈ సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించి అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో కలెక్టర్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సంపద సృష్టి కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆ ఆదేశాల మేరకు మండలంలోని కరాసవలస, తోణాం, బాగువలస, తదితర కేంద్రాలకు సున్నాలు వేసి కొంతమేర శుభ్రం చేశారు. అంతేకాకుండా బ్యానర్లు కట్టి బోర్డులు రాయించారు.పిట్స్‌లో చెత్త వేసి అందులో ఎరువు తయారుచేసే కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా ఇంతవరకు ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇదిలా ఉండగా అసలు చాలావరకు గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమం కూడా జరగడం లేదంటే కూటమి ప్రభుత్వ హయాంలో అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. చాలా చోట్ల చెత్త వేయాల్సిన పిట్స్ విరిగిపోయాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మండలంలో పనులు ఏమేరకు సక్రమంగా నిర్వహిస్తున్నారో అర్థమవుతుందని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● అక్కరకురాని మంచినీటి పథకం



కురుపాం మండలం, కిచ్చాడ గ్రామంలోని రామ మందిరం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి పథకం అవసరానికి ఉపయోగపడడం లేదు. రామమందిరం వీధి సహా కాపు వీధి ప్రజలకు తాగునీరు అందించేందుకు వెయ్యి లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ట్యాంకు నుంచి చుక్కనీరు రావడం లేదు. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండగా తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. –గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

● పనస ధర పతనం



సీతంపేట మన్యంలో విరివిగా దొరికే చెట్టు పనస ధర పతనమైంది. ఈ సీజన్‌లో దొరికే ఈ పండ్లను ఎంతోమంది కొనుగోలు చేసి ఇష్టంగా ఆరగిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ పనస ధర మార్కెట్‌లో దారుణంగా పడిపోయింది. గతేడాది ఒక్కో పండు రూ.60 విక్రయించగా, ఇప్పుడు రూ.40లకు విక్రయిస్తున్నారు. దిగుబడులు అధికమవ్వడంతో సరఫరా విపరీతంగా పెరిగిందని, ఇప్పుడు డిమాండ్‌లేక ధర పడిపోయిందని గిరిజన రైతులు చెబుతున్నారు. –సీతంపేట

● ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



జియ్యమ్మవలస మండలం, ఇటిక గ్రామం వద్ద రోడ్డు పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఓ పక్కకు ఒరిగిపోయి ఏ క్షణానైనా పడిపోవచ్చన్నట్లుగా ఉంది. అటువైపుగా పొలాలకు వెళ్లే వారు, రోడ్డుపై ప్రయాణించే వారంతా తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ సరఫరా ఉన్నప్పుడు స్తంభం పడిపోతే పరిస్థితి ఏంటని అంటున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు మేలుకోవాలని, స్తంభం నిలబెట్టాలని కోరుతున్నారు. –జియ్యమ్మవలస రూరల్